సాక్షి
అనంతపురం

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



అనంతపురంలో రాజన్నకు పుష్పాంజలి



అనంతపురం జెడ్పీలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించిన దృశ్యం

న్యూస్‌రీల్

బీడు భూమి కనిపించొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ''జిల్లాలో బీడు భూమి కనిపించకూడదు. రైతులు ఏదో ఒక రకమైన పంట సాగు చేసేలా ప్రోత్సహించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు సుస్థిర జీవనోపాధి, స్థిరమైన ఆదాయం చూపేలా కార్యాచరణ ఉండాలన్నారు. ప్రణాళికలు రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికీ ఆదాయం వచ్చేలా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. భూముల్లో రైతులు ఏ పంటలు వేశారనేది గుర్తించాలన్నారు.ఉద్యాన పంటలు, గ్రీన్ ఎనర్జీ, పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా డీఆర్‌డీఏ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న పథకాలపై మండలాల వారీగా విజయగాథలు తయారు చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మా నాయక్, డీఆర్ డీఏ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశం వాయిదా

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. తన చాంబర్‌లో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్యతో కలసి మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 9న సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే, 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం పర్యటన నేపథ్యంలో వాయిదా వేసినట్లు వివరించారు. జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో బిజీగా ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులకు సమాచారం చేరవేశామన్నారు.


దీర్ఘకాలిక సెలవులో తాడిపత్రి సీఐ సాయిప్రసాద్



సాక్షి టాస్క్‌ఫోర్స్: తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సాయిప్రసాద్ మంగళవారం నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఉన్నఫలంగా ఆయన సెలవుపై వెళ్లడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. గత నెల 31న పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనంలో భాగంగా నిర్వహించిన శోభాయాత్ర ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. అధికార టీడీపీకి చెందిన రెండు వర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు టీడీపీకి చెందిన 20 మందిపై కేసు నమోదు చేశారు. దీన్ని తట్టుకోలేని ఓ టీడీపీ నేత సీఐ సాయిప్రసాద్‌కు ఫోన్ చేసి దుర్భాషలాడినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన సీఐ సెలవుపై వెళ్లినట్లు సర్వత్రా చర్చ జరుగుతోంది. కాగా, తాడిపత్రి పట్టణ ఇన్‌చార్జ్ సీఐగా బాధ్యతలను మంగళవారం రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి స్వీకరించారు.

ప్రభుత్వ దుర్మార్గాలపై ప్రశ్నిస్తే కేసులా?

- మాజీ ఎమ్మెల్యే, పార్టీ పీఏసీ సభ్యులు వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించేందుకు కుట్రలు పన్నుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలు, దుర్మార్గాలను ప్రశ్నిస్తున్నందుకు కుట్ర పూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కేసులతో వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గతంలో 'సాక్షి' ఎడిటర్ ఇంట్లోకి చొరబడి సోదాలు నిర్వహించడం, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్టు తదితర వాటిని పరిశీలిస్తే నిజాలు నిర్భయంగా రాస్తున్న 'సాక్షి'ని లేకుండా చేయాలన్న దుర్బుద్ధితో ప్రభుత్వం ఉన్నట్లు కన్పిస్తోందన్నారు. ప్రజాస్వామ్యవాదులు, జర్నలిస్టు సంఘాలు ఇలాంటి కుయుక్తులను ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.



అనంతపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంత, వైఎస్సార్ సీపీ నేతలు



ఉరవకొండలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించిన విశ్వ, పార్టీ నాయకులు

పేదల పెన్నిధి వైఎస్సార్

- జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు
- వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించిన ప్రజలు
- సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- జనం గుండెల్లో నిలిచిన నేత వైఎస్సార్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

దివంగత నేత వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రజలు ఆయనకు ఘన నివాళులర్పించారు. మంగళవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. మహానేతను మనసారా స్మరించారు. ఆయన అందించిన సంక్షేమ పాలనను గుర్తు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటారు. పేదల పెన్నిధి వైఎస్సార్ అంటూ కొనియాడారు.



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న పార్టీ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి



పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో అనంతపురంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనంత

అనంతపురం కార్పొరేషన్: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక సంస్కరణలకు వైఎస్సార్ శ్రీకారం చుట్టారన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకురావడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 104, 108 తదితర పథకాలతో పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న దార్శనికుడు వైఎస్సార్ అని కొనియాడారు. అనంతరం జెడ్పీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

- కళ్యాణదుర్గంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌ను ప్రజలు మరువరన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మండల కన్వీనర్లు సుధీర్, గోళ్ల సూరి, ఎంపీపీ మారుతమ్మ పాల్గొన్నారు.
- రాయదుర్గంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప నివాళులర్పించారు. సంక్షేమ ప్రదాత వైఎస్సార్ అని కొనియాడారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన సువర్ణ అధ్యాయమని వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ బుక్కచెర్ల నల్లప రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కురుబ నాగిరెడ్డి అన్నారు. రాప్తాడులో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు.
- గుంతకల్లులో వైఎస్సార్ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘన నివాళులర్పించారు. గుత్తి, పామిడిలో మాజీ సర్పంచ్ హుస్సేన్ పీరా, జెడ్పీటీసీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.
- తాడిపత్రిలోని వైఎస్సార్ సర్కిల్‌లో, మండలంలోని సజ్జలదిన్నె పార్క్‌లో వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు నివాళులర్పించాయి. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా నేత ఫయాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.
- శింగనమల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు వీరాంజనేయులు, నార్పల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రైతాంగానికి వెన్నుదన్ను

- 'జలయజ్ఞం' ద్వారా ఎన్నో తాగు, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి వైఎస్సార్ వెన్నుదన్నుగా నిలిచారని వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి కొనియాడారు. ఉరవకొండలో వైఎస్సార్ విగ్రహానికి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, సర్పంచ్ లలితమ్మ పాల్గొన్నారు.



రాప్తాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, నాయకులు



కళ్యాణదుర్గంలో వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య, నాయకులు



తాడిపత్రిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషా తదితరులు



గుంతకల్లులో మహానేతకు నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, పార్టీ నాయకులు

కొల్లగొడుతున్నా కనిపించదా?

గనుల శాఖ మౌనవ్రతం

- సహజ వనరుల లూటీ జరుగుతున్నా కానరాని చర్యలు
- రాప్తాడులో గుట్టలు, కొండల్ని పిండిచేసిన 'తమ్ముళ్లు'
- శింగనమల, తాడిపత్రిలో అక్రమార్కుల చెరలో వంకలు, వాగులు
- రాయదుర్గం నుంచి రోజూ వందల టిప్పర్ల ఇసుక కర్ణాటకకు
- గనుల శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



'తమ్ముళ్ల' దెబ్బకు నామరూపాలు కోల్పోయిన ఆలమూరు సమీపంలోని కొండ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి అధికార పగ్గాలు చేపట్టాక జిల్లాలో సహజ వనరుల లూటీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. నదులు, గుట్టలను చెరబట్టి మీటర్ల కొద్దీ తవ్వి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన గనుల శాఖ అసలు పట్టించుకోవడమే లేదు. ఎమ్మెల్యేల ఒత్తిళ్లా.. మామూళ్లు అందుతుండడమా.. అనేది తెలియడం లేదు. రోజూ వందలకొద్దీ టిప్పర్లు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. గనుల శాఖ, పోలీసులు చేస్తున్న 'మౌన వ్రతం' దుష్పరిణామాలకు దారి తీస్తోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కరిగిపోయిన కొండలు...

రాప్తాడు నియోజకవర్గంలోని క్రిష్ణంరెడ్డిపల్లె, ఆలమూరు కొండలు, గుట్టలు ఇప్పటికే కరిగిపోయాయి. టీడీపీ నేతల అక్రమాలకు అడ్డేలేకుండా పోయింది. ఆలమూరు కొండను దాదాపుగా నేలమట్టం చేశారు. క్రిష్ణంరెడ్డిపల్లెలో భారీ గుట్టల నుంచి రోజూ మట్టిని తరలిస్తున్నారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే రోజూ లక్షల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు తేలింది. అయినా, దీనిపై గనుల శాఖ ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు.

కర్ణాటకకు విచ్చలవిడిగా..

రాయదుర్గం నియోజకవర్గం ఖనిజ అక్రమ రవాణాకు కేంద్రబిందువుగా మారింది. డీ హీరేహాళ్ మండలం కాదలూరు నుంచి మీటర్ల కొద్దీ హగరి నదిని తవ్వేసి ఇసుకను కర్ణాటకలోని మొలకల్మూర్ నియోజకవర్గం గుండా బళ్లారికి తరలిస్తున్నారు. టీడీపీ కీలక నేత ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దందా విలువ రూ. కోట్లలో ఉంటుందని అంచనా. అయినా, గనుల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. రోజూ 200 టిప్పర్లు కర్ణాటకకు వెళుతున్నా పోలీసులూ పట్టించుకోవడం లేదు.

తాడిపత్రి, శింగనమలలో..

తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల పరిధిలో ఉన్న వంకలు, వాగులు స్వరూపమే కోల్పోయాయి. కొన్ని గ్రామాల్లో ప్రజలే అడ్డుకుంటున్నా అక్రమార్కులపై చర్యలు లేవు. ఇక తాడిపత్రి నియోజకవర్గంలో అయితే పెన్నా నదిలో ఇసుక పూర్తిగా అడుగంటి పోయింది. సుమారు 20 మీటర్ల లోతులో జేసీబీలతో తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారు. ప్రధాన జాతీయ రహదారిపైనే అక్రమంగా ఇసుక టిప్పర్లు వెళ్తున్నా స్పందించే దిక్కు లేదు.

కూడేరులో అనుమతుల్లేకుండానే..

కూడేరు మండలంలోని పీఏబీఆర్ సమీపంలో అనుమతులు లేకుండా ఇటీవల భారీగా గ్రానైట్ తవ్వకాలు మొదలుపెట్టారు. గనుల శాఖ అధికారులను అడిగితే తాము అనుమతులు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం. రోజూ 30 టిప్పర్ల ద్వారా అక్కడ కార్యకలాపాలు నడిచాయి. దీనిపై కొన్ని రోజుల క్రితం 'సాక్షి'లో కథనం రాగానే మైనింగ్ ఆపేశారు.

తట్టెడు మట్టికూడా మిగలదు..

ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో సహజ వనరులను కొల్లగొడుతుండడం చూస్తే భవిష్యత్ తరాలకు తట్టెడు మట్టి కూడా మిగలదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొండలు నేలమట్టమయ్యాయి. నదుల్లో ఇసుక అడుగంటి పోయింది. భవిష్యత్‌లో ఇళ్లు కట్టాలంటే ఇసుక కనిపించే పరిస్థితి లేదు. దీంతో వచ్చే రోజుల్లో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. .

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సుబ్రహ్మణ్యం

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూపరింటెండెంట్‌గా డాక్టర్ మల్లీశ్వరి పేరును ఖరారు చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ, అనూహ్యంగా సుబ్రహ్మణ్యం తెరపైకి రావడం వైద్య వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈయన నియామకం వెనుక కర్నూలు జిల్లాకు చెందిన ఓ మంత్రి చక్రం తిప్పినట్లు సమాచారం.

పలువురి అసంతృప్తి..

సుబ్రహ్మణ్యం నియామకంపై సర్వజనాస్పత్రిలోని పలువురు డాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తుంటారనే ఆరోపణలున్నాయి. ఉదయం 8.30 గంటలకే బయోమెట్రిక్ వేసుకుని పత్తా లేకుండా పోతున్నట్లు తెలుస్తోంది. పని తప్పించుకుని తిరిగే వారికి పట్టం కట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జీఎంసీ ప్రిన్సిపాల్‌గా విజయశ్రీ

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయశ్రీ ప్రస్తుతం విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో పెథాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేమ్ బోర్డులో వైఎస్సార్ పేరు తొలగింపు

- మండిపడ్డ వైఎస్సార్ సీపీ శ్రేణులు
- గుంతకల్లు మార్కెట్ యార్డ్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన



రైతు బజార్ వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గుంతకల్లు: స్థానిక మార్కెట్ యార్డులోని రైతు బజార్ కేంద్రం నేమ్ బోర్డులో వైఎస్సార్ పేరు తొలగించడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. దీనిపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డు చైర్మన్ సుగాలి లక్ష్మీదేవి భర్త మృతనాయక్ చెప్పడంతోనే వైఎస్సార్ పేరు తొలగించినట్లు యార్డు సెక్రటరీ బాలాజీరావు పేర్కొనడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి మాట్లాడుతూ రైతు బాంధవుడిగా పేరుగాంచిన వైఎస్సార్ పేరును తొలగించడం అన్యాయమన్నారు. ఈ నెల 6న తమ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అన్నదాతల సమస్యలపై ఉద్యమం చేపడుతున్నామని, అంతలోపు వైఎస్సార్ పేరును నేమ్ బోర్డ్‌లో చేర్చకపోతే మార్కెట్ యార్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్ పేరు తొలగించారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాజన్న ఎంతగానో పాటుపడ్డారన్నారు. గుంతకల్లు మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో యార్డులో షెడ్లు ఏర్పాటు చేశారని, డ్రైనేజీ సమస్య పరిష్కరించారని గుర్తు చేశారు. 6వ తేదీలోపు వైఎస్సార్ పేరును చేర్చకపోతే మార్కెట్‌యార్డును దిగ్బంధిస్తామని హెచ్చరించి ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఆర్.బాబురావు,అబ్దుల్‌బాసిద్, రంగనాయకులు, కొనకొండ్ల అంజి, బావన్న, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కౌన్సిలర్లు లింగన్న, సమోబాషా, జేసీబీ చాంద్‌బాషా, నీలావతి, మున్సిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు సుంకప్ప, నాయకులు హరి, గోవింద్‌నాయక్, సాంబ, మౌలా, ఆరీఫ్, మల్లారెడ్డి, షాబుద్దీన్, పవన్, ఆనంద్, శివాజీ, నాగాంజినేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న మధ్యాహ్నం తర్వాత ఆలయం మూసివేత



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దేవదాయ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఈ నెల ఏడో తేదీ మధ్యాహ్నం 1 గంట తర్వాత మూసివేస్తున్నట్లు ఈఓ బాబు, అర్చకులు మంగళవారం తెలియజేశారు. ఆ రోజు రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున మధ్యాహ్నం మూసివేసి.. ఎనిమిదో తేదీ ఉదయం ఆలయం తలుపులు తెరుస్తామన్నారు. ఇదిలా ఉండగా దేవదాయ ధర్మదాయ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి మంగళవారం ఆలయాన్ని సందర్శించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సిబ్బంది సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

దిబ్బసానిపల్లిలో షార్ట్ సర్క్యూట్



కాలిపోయిన వస్తువులు

పామిడి: దిబ్బసానిపల్లిలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గ్రామానికి చెందిన మజ్జిగ లక్ష్మీదేవి వితంతువు. ఈమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు మంగళవారం పనిమీద వేరే ఊరెళ్లాడు. లక్ష్మీదేవి పొలానికి వెళ్లింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో రూ.1,60,000 నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల విలువైన ప్రాంసరీ నోట్లు, టీవీ, ఫ్రిజ్, చీరలు, దుస్తులు, విలువైన వస్తువులు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

8న నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిసిషిప్ మేళా ఈ నెల 8న అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.రాయపరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు హాజరై ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఈ ఏడాది (2025) ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసే విద్యార్థులందరూ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల మెమోలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం మూడు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు.

అవుట్ సోర్సింగ్.. ఏజెన్సీపరం

- జేఎన్‌టీయూఏ పరిధిలో 650 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- గత ప్రభుత్వంలో ఆప్కాస్ ద్వారా వేతనాలు
- ఏజెన్సీకి మార్పు చేసిన కూటమి సర్కారు



జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనం

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూఏ) పరిధిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ నుంచి తప్పించి ఏజెన్సీ పరిధిలోకి తెచ్చారు. చిరుద్యోగుల జీవితాలను చిదిమేసే ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 2008లో యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. వర్సిటీ కార్యకలాపాల నిర్వహణకు అవుట్ సోర్సింగ్ కింద నియామకాలు చేపట్టారు. యూనివర్సిటీలో 274, వర్సిటీ పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో 120, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో 150, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 80, ఓటీఆర్ఐలో 26 మంది చొప్పున మొత్తం 650 మంది పనిచేస్తున్నారు. వీరందరికి ప్రభుత్వమే జీతాలు చెల్లించేది. అప్పటి నుంచి ఉద్యోగాలు చేస్తున్నవారిని ఇప్పుడు ఏజెన్సీ పరిధిలోకి తీసుకురావడంతో ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే తమ జీతాలు పెరుగుతాయని ఆశిస్తే.. ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

అంతలోనే ఎంత తేడా..

చిరుద్యోగులకు దన్నుగా నిలిచేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతం చెల్లించేది. ఉద్యోగులను ఇష్టానుసారం తొలగించే పరిస్థితి లేకుండా భద్రత కల్పించింది. పీఎఫ్ సౌకర్యం ఉండేది. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఆప్కాస్ నుంచి జీతాలు చెల్లించలేమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేసే ఉద్యోగులకు ఆప్కాస్ కింద జీతాలు చెల్లిస్తున్నారు. ఒక్క జేఎన్‌టీయూ అనంతపురంలో మాత్రం ఏజెన్సీ కిందకు తెచ్చారు. దీంతో యూనివర్సిటీ అంతర్గత వనరుల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో జేఎన్‌టీయూ అనంతపురంలో ఇద్దరు, కలికిరిలో 5 మందిని మాత్రమే ఉద్యోగాల్లో తీసుకున్నారు. మొత్తం 650 మందిలో గత ప్రభుత్వంలో ఏడుగురిని మాత్రమే ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. 643 మంది గతంలో నుంచి కొనసాగుతున్న వారే. తాజాగా ఏజెన్సీ కిందకు తీసుకరావడంతో జీతాల చెల్లింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏజెన్సీ దయాదాక్షిణ్యాలపైనే ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీంతో జేఎన్‌టీయూ అనంతపురం ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మరో వైపు జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ హాస్టళ్లలో ఆహారం సరఫరాకు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ తరహాలో ఏజెన్సీ ఆహారం సరఫరా చేస్తోంది. ఇదే జరిగితే హాస్టళ్లలో పనిచేసే ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

ఎస్కేయూలోనూ అభద్రతే!

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 80 మంది అకడమిక్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. యూనివర్సిటీలో రెగ్యులర్ ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత అధికంగా ఉంది. మొత్తం 50 మంది ప్రొఫెసర్లు కూడా రెగ్యులర్‌గా లేరు. ఈ నేపథ్యంలో వీరికి సహాయంగా పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత పొందిన వారిని అకడమిక్ కన్సల్టెంట్‌లుగా నియామకం చేసుకున్నారు. వీరికి అవర్ బేస్డ్ జీతాలు ఇస్తున్నారు. ఏడాదికోసారి నియామకాలు చేస్తారు. దీంతో వీరికి ఆదివారంతో గడువు పూర్తయింది. తిరిగి రెన్యూవల్ చేయకుండా తాత్సారం చేశారు. దీంతో వీరిలోనూ అభద్రత వెంటాడుతోంది. గడువులోపే రెన్యూవల్ చేసి ఉంటే తరగతులకు విఘాతం కలిగి ఉండేది కాదు. ఈ 80 మంది అకడమిక్ కన్సల్టెంట్లను కొనసాగించి.. తరగతులకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని విద్యార్థులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం

- కలెక్టర్‌తో బొప్పాయి రైతు ఓబయ్య ఆవేదన



బొప్పాయి ధరపై కలెక్టర్‌కు వివరిస్తున్న రైతు

కూడేరు: వర్షాల వల్ల ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, ఇతర ప్రాంతాలకు బొప్పాయి ఎగుమతి సరిగా లేదు. దీంతో స్థానికంగా గిట్టుధర లేక నష్టపోతున్నామని రైతు ఓబయ్య కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మంగళవారం కమ్మూరులో పర్యటించారు. బొప్పాయి సాగు చేసిన ఓబయ్య పొలాన్ని సందర్శించి.. ఎన్ని కోతలయ్యాయి. మార్కెటింగ్ సదుపాయం ఉందా, ఎంత ధరతో విక్రయిస్తున్నారని ఆరా తీశారు. ఇది వరకు కిలో బొప్పాయి రూ.20 వరకు విక్రయించామని, ఇప్పుడు వర్షాలతో కిలో రూ.5లోపే వ్యాపారస్తులు కొనుగోలు చేసి బెంగళూరుకు తరలిస్తున్నారని రైతు తెలిపారు. కనీసం కిలో రూ.10 ఉన్నా గిట్టుబాటు అవుతుందని రైతు తెలిపారు. బొప్పాయిని కోల్డ్ స్టోరేజ్‌లో ఎన్ని రోజులు పెట్టొచ్చని హార్టికల్చర్ అధికారులతో కలెక్టర్ ఆరా తీయగా.. వారం రోజులు కంటే ఎక్కువ రోజులు ఉండదని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంపీ పీడీ రఘునాథ్ రెడ్డి , ఏపీడీ ధనుంజయ్య,, నియోజక వర్గ హార్టికల్చర్ ఆఫీసర్ యామిని , తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ప్రజోపయోగ పనులకు సహకరించాలి

అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగం చేపడుతున్న ప్రజోపయోగ పనులకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. రైల్వే క్రాసింగ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి మండలం గన్నేవారిపల్లిలో రైల్వే క్రాసింగ్ 159పైన ఫ్లైఓవర్ నిర్మాణానికి 3.79 ఎకరాల పట్టాభూమి సేకరించాల్సి వస్తుందన్నారు. పరిహారం విషయంలో భూ యజమానులైన రైతులు సహకరించాలన్నారు. ఎకరాకు రూ.38 లక్షలు పరిహారం చెల్లించేలా తీర్మానించామన్నారు. అదే విధంగా తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని 15 గ్రామాల్లో అదానీ రెన్యువబుల్ ఎనర్జీ ద్వారా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణానికి పరిహారం చెల్లింపు విషయంపై రైతులతో కలెక్టర్ చర్చించారు. జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్‌డీఓ కేశవనాయుడు, తాడిపత్రి తహసీల్దారు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీ అధికారులు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా తాము పని చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ, అనుబంధ విభాగాల్లో పని చేస్తూ అకాల మృత్యువాతపడ్డ ఉద్యోగులకు సంబంధించిన వారసులు తొమ్మిది మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగావకాశం కల్పించారు. వారందరికీ జెడ్పీ చైర్‌పర్సన్ తన చాంబర్‌లో నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో ఎస్.మమత (పీఆర్ఐ సబ్ డివిజన్–మడకశిర), శోభ (ఎంపీపీ ఆఫీస్–మడకశిర), కేఆర్ రాఘవేంద్రరావు (ఎంపీపీ ఆఫీస్ –శెట్టూరు), వి.శకుంతల (జెడ్పీహెచ్ఎస్ – చెన్నేకొత్తపల్లి), సి.భార్గవి (జెడ్పీహెచ్ఎస్ – చుక్కలూరు), వై.ప్రసన్నకుమార్, పి.దీపక్ (జెడ్పీ–అనంతపురం), కె.బంధ నవాజ్ (పీఆర్ఐ, పీఐయూ–అనంతపురం), ఎస్.ధనలక్ష్మి (ఎంపీపీ ఆఫీస్ –బుక్కరాయసముద్రం) ఉన్నారు. వారినుద్దేశించి చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో బాధ్యతలను సమర్థవంతంగా అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య, ఏఓలు షబ్బీర్ నియాజ్, విజయభాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- మహిళ దుర్మరణం
- మరో ముగ్గురికి గాయాలు



బోల్తాపడిన ఆటో (ఇన్‌సెట్‌లో) లలితమ్మ (ఫైల్)

గుంతకల్లుటౌన్: అడ్డు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. మరో ముగ్గురు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా మద్దికెర భోగప్పబావి వీధికి చెందిన లలితమ్మ (55) ఇరుగుపొరుగు వారితో కలిసి అరుణాచలం ఆలయానికి వెళ్లేందుకని ఆటోలో గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు బయల్దేరారు. స్టేషన్ ప్రవేశమార్గంలో ఉన్న క్రాస్ వద్ద ఆటోకు కుక్క అడ్డురావడంతో దానిని తప్పించేందుకని డ్రైవర్ యత్నించాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రగాయాలపాలైన లలితమ్మను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. మరో ముగ్గురు మహిళలు సావిత్రమ్మ, ఈశ్వరమ్మ, స్వాతి స్వల్పంగా గాయపడ్డారు. మృతురాలి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని యువతిపై ఆటో డ్రైవర్ దాడి



చికిత్స పొందుతున్న బాధితురాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో మతిస్థిమితం లేని యువతిపై మంగళవారం ఆటో డ్రైవర్ ముబారక్ మద్యం మత్తులో మటన్ కొట్టే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతిని అభిజ్ఞ ఫౌండేషన్ సభ్యులు అలి, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చదరంగంలో జిల్లా టాపర్‌గా జునైరా



గుంతకల్లు: చదరంగంలో రాపిడ్ విభాగంలో గుంతకల్లుకు చెందిన జునైరా అనే విద్యార్థిని 1,698 అత్యధిక రేటింగ్ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు కోచ్‌లు అనిల్‌కుమార్, రామారావు తెలిపారు. గత నెలలో బెంగళూరులో జరిగిన ఇంటర్ నేషనల్ రాపిడ్ ఇండిపెండెన్స్ కప్ చెస్ టోర్నీమెంట్‌లో జునైరా విజయం సాధించి రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా ఈ నెల ఒకటిన విడుదల చేసిన చదరంగ జాబితాలో జునైరా చోటు సంపాదించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జునైరాను తల్లిదండ్రులుతోపాటు సెయింట్ పీటర్స్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, కోచ్‌లు అభినందిచారు.

సమగ్రశిక్ష ఐఈడీ పోస్టుకు రీ నోటిఫికేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో ఆరు సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో ఐఈడీ కోఆర్డినేటర్ పోస్టుకు ఒక అభ్యర్థి మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆయన కూడా నాట్‌విల్లింగ్ ఇవ్వడంతో ఆ పోస్టుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రీ నోటిఫికేషన్ జారీ చేస్తూ మంగళవారం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 6లోగా httpr://ramafrarhikhaatp.bofrpot.comవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యాలు కల్గి ఉండాలని పేర్కొన్నారు. నోటిఫికేషన్ తేదీ 01-09-28 నాటికి 55 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి. క్రమశిక్షణ చర్యలు పెండింగ్ ఉన్న టీచర్లు డిప్యుటేషన్‌కు పరిగణించబడరని స్పష్టం చేశారు. సమగ్ర శిక్షలో ఐదేళ్లు నిరంతర లేదా వేర్వేరు కాలాల్లో డిప్యుటేషన్‌పై పని చేసిన వారు అనర్హులని పేర్కొన్నారు. 6వ తేదీ సాయంత్రం 5.30 గంటల తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలో పని చేస్తున్న ఆసక్తి గల ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టిలో చిక్కుకుని ఇద్దరు కూలీలు మృతి

యశవంతపుర: ఉపాధి కోసం కర్ణాటకకు వలస వెళ్లిన ఇద్దరు అనంతపురం జిల్లా కూలీలు పునాది తవ్వుతున్న సమయంలో మట్టిదిమ్మెలు విరిగిపడి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని యలహంకలో ఎంబసీ గ్రూప్‌కు చెందిన భారీ భవన నిర్మాణం కోసం కూలీలు పునాదులు తవ్వుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మట్టిదిమ్మెలు విరిగి అనంతపురం జిల్లాకు చెందిన కూలీలు శివ (35), మధుసూదనరెడ్డి (48)పై పడ్డాయి. తోటి కూలీలు మట్టిని తొలగించి వారిని బయటకు తీయగా.. అప్పటికే శివ చనిపోయాడు. మధుసూదన్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మట్టి వదులుగా మారి విరిగిపడినట్లు కూలీలు చెబుతున్నారు. యలహంక పోలీసులు భవన యజమానిపై కేసు నమోదు చేశారు.

'సోలార్' ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

గుత్తి: రైతులకు తీరని నష్టం కలిగించే సోలార్ ఇండస్ట్రీ ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తి మండలం బేతాపల్లిలోని సోలార్ ఇండస్ట్రీని మంగళవారం ఆయన ఏపీ రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. సోలార్ ఇండస్ట్రీకి భూములు ఇచ్చిన రైతులతో మాట్లాడారు. అనంతరం గుత్తి ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. సోలార్ ఇండస్ట్రీ వల్ల పంట భూములు నాశనం అవుతాయన్నారు. రైతుకు ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి 30 ఏళ్ల లీజుకు తీసుకుంటారన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా రైతులు ఢిల్లీకి వెళ్లి గోడు చెప్పుకోవలసి వస్తుందన్నారు. బేతాపల్లిలో ఏకంగా 17 వేల ఎకరాల భూములు తీసుకున్నారన్నారు. ఆ భూములపై ఇక రైతులు ఆశలు వదులుకోవలసిందేనన్నారు. ప్రభుత్వం పునరాలోచించి సోలార్ ఇండస్ట్రీకి భూములు తీసుకోవడం ఆపేయాలన్నారు. లేకపోతే ఏపీ రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు దస్తగిరి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం'

లేపాక్షి: కూటమి పాలనలో వ్యవస్థలన్నింటినీ సర్వనాశనమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. మంగళవారం లేపాక్షిలోని టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేపరం చేయాలన్న ప్రధాని నరేంద్రమోదీ ఆశయ సాధనకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, యూనివర్సిటీలను ప్రైవేటుపరం చేయడానికి పూనుకున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తే చంద్రబాబు చరిత్రహీనుడవుతారని స్పష్టం చేశారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నా ప్రైవేటుపరం చేయడానికి సమాయత్తమవుతున్నారని, దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, రూ.260 యూరియా బస్తాను రూ.500కు విక్రయిస్తున్నారని, డీఏపీపైనా రూ.200 అదనంగా దండుకుంటున్నారని మండిపడ్డారు. జన గణనతోపాటు కుల గణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య పాల్గొన్నారు.

రిజిస్టర్ పోస్టు రద్దు ప్రక్రియ వాయిదా

అనంతపురం సిటీ: తపాలా శాఖలో వినియోగదారులకు అతి తక్కువ ధరకు మెరుగైన సేవలందిస్తున్న 'రిజిస్టర్ పోస్టు' సేవల రద్దు నిర్ణయాన్ని నెల రోజుల పాటు వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్ పోస్టును రద్దు చేసి, స్పీడ్ పోస్టులో విలీనం చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న దృష్ట్యా రద్దు నిర్ణయాన్ని మరో నెల రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిందని ఉద్యోగులు పేర్కొన్నారు.

యూరియా కోసం ఎదురుచూపే

- కోటా మేరకు ఇంకా 10,814 మెట్రిక్ టన్నులు రావాలి
- యూరియా వాడకంపై జిల్లా యంత్రాంగం హడావుడి
- ఈ నెల 6న యూరియా అంశంపై వైఎస్సార్‌సీపీ నిరసన



అనంతపురం అగ్రికల్చర్: యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వరి, మొక్కజొన్న, అరటితో పాటు వేరుశనగ, కంది, ఆముదం రైతులకు యూరియా అవసరం ఏర్పడింది. అధికారులేమో అనవసరంగా యూరియా వాడొద్దని సూచనలు చేస్తున్నారు. మోతాదుకు మించి వాడటం వల్ల పంట దిగుబడులు తగ్గిపోతాయని చెబుతున్నారు. యూరియా కొరత ఏర్పడటంతో రైతుల దృష్టి మళ్లించడానికి అధికారులు ఈ రకమైన సలహాలు ఇస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంటల వారీగా ఎంత యూరియా వాడాలనే దానిపై కరపత్రాలతో అవగాహన కల్పించే కార్యక్రమానికి తెర తీశారు. ఇన్నేళ్లలో ఎపుడూ యూరియా వాడకంపై అవగాహన కల్పించని జిల్లా యంత్రాంగం ఇప్పుడు హడావుడి చేస్తుండటంపై రైతులు విస్తుపోతున్నారు. ఈ ఖరీఫ్‌లో అన్ని రకాల ఎరువులు 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రణాళిక అమలు చేస్తున్నారు. అందులో యూరియా టార్గెట్ 26,839 మెట్రిక్ టన్నులు. మిగతావి డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, సూపర్ ఎరువులు ఉన్నాయి. కంపెనీల వారీగా, నెల వారీగా సరఫరా టార్గెట్లు విధించారు.

అందుబాటులో 31,266 మెట్రిక్ టన్నులు

ఈ సీజన్‌లో అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 26,839 మెట్రిక్ టన్నుల యూరియా ప్రణాళిక అమలు చేస్తున్నారు. అలాగే గత ఖరీఫ్, రబీకి సంబంధించి మిగులు 15,241 మెట్రిక్ టన్నులు ఉండటం ఈసారి కొంత వరకు కలిసొచ్చిన అంశం. అది లేకుండా ఉండి ఉంటే ఈపాటికి జిల్లాలో యూరియా సమస్య తీవ్రస్థాయిలో ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా మిగులుతో పాటు ఈ ఖరీఫ్ ప్రణాళికలో ఇప్పటి వరకు 16,025 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా అయినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 31,266 మెట్రిక్ టన్నులు అందుబాటులో పెట్టామని చెబుతున్నారు. సెప్టెంబర్ నెల టార్గెట్ 6,827 మెట్రిక్ టన్నులుగా నిర్ణయించారు. అయితే సీజన్ టార్గెట్, సరఫరా పరిగణనలోకి తీసుకుంటే ఇంకా 10,814 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరాలి.

సరిహద్దులు దాటినట్లు అనుమానాలు

ఏప్రిల్, మే నెలలో యూరియా వాడకం తక్కువగా ఉండటం, అలాగే జూన్, జూలైలో వర్షాలు లేక యూరియా వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో పక్కదారి పట్టడానికి అవకాశం ఏర్పడినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మొత్తంలో యూరియా జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు ప్రాంతంలో యూరియా కేటాయింపులు తక్కువగా ఉండటం, అలాగే పక్క జిల్లాల్లో యూరియా వాడకం కాస్త ఎక్కువగా ఉండటంతో జిల్లా నుంచి తరలించి కొందరు సొమ్ము చేసుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి అధికారులు కొందరు సహకరించారని చెబుతున్నారు. ఈ క్రమంలో ఆగస్టులో విస్తారంగా వర్షాలు రావడం, వరి నాట్లు ఊపందుకోవడం, మొక్కజొన్న విస్తీర్ణం పెరగడం, అరటికి వాడకం, అలాగే వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలకు పైపాటుగా వేయాల్సి ఉండటంతో ఒక్కసారిగా యూరియాపై రైతులు దృష్టిసారించారు. కానీ నిల్వలు తక్కువగా ఉండటంతో రైతులు రోడ్డెక్కారు. 20 రోజులుగా యూరియా సమస్య రైతులను పీడిస్తున్నా... తగినంత అందుబాటులో పెట్టించడంలో కూటమి సర్కారు, జిల్లా యంత్రాంగం, వ్యవసాయశాఖ విఫలమైంది. కూటమి సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ, విజిలెన్స్, సహకారశాఖ తదితర శాఖలను రంగంలోకి దింపి యూరియా వ్యవహారంపై తనిఖీలు, సోదాలు చేస్తున్నా పెద్దగా ఫలితం కనిపంచడం లేదని చెబుతున్నారు. ఇక ఈనెల 6న వైఎస్సార్‌సీపీ యూరియాపై పోరుకు పిలుపు ఇవ్వడంతో కూటమి సర్కారు, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై రైతులు రోడ్డెక్కకుండా శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

కక్షపూరిత రాజకీయాలు తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, అధికారం శాశ్వతం కాదని, కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండిపడ్డారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేయాలి.. కానీ ఇలా అక్రమ కేసులు పెట్టించడం, దాడులు చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలూ ఎవరి మీద అక్రమ కేసులు బనాయించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఎంపీపీ హేమలత, నాయకులు వాసుదేవరెడ్డి, బందూక మధు, నరసింహారెడ్డి, మల్లన్న, సోము, శివారెడ్డి, వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, బోయ వెంకటేష్, టీటీ టైలర్ వెంకటేష్, నరేష్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, మరళి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుగాలి ప్రీతిబాయి హంతకులకు కఠినంగా శిక్షించాలి

అనంతపురం టవర్‌క్లాక్: సుగాలి ప్రీతిని అత్యాచారం, హత్య చేసిన హంతకులకు కఠినంగా శిక్షించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్ప నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనెల 8న తలపెట్టిన రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామప్ప నాయక్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గతంలో రాజకీయ లబ్ధి కోసం ప్రీతి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట నిలుపుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు గట్టు రామాంజనేయులు, ఆనంద్, నరేష్ కొడవండ్ల, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న డివిజన్ అధికారి నాగశివలీల

ఆత్మకూరు: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని డివిజినల్ అధికారి నాగశివలీల సూచించారు. మంగళవారం మండలంలోని ఆత్మకూరు, పి, యాలేరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. గ్రామ పంచాయితీల్లో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణ , చెత్త శుభ్రం చేసే విధానాన్ని పరిశీలించారు. కాలువలు, రోడ్లపై చెత్త వేయడం వల్ల అపరిశుభ్రత నెలకొని, రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. పంచాయతీ వాహనాల్లో చెత్త వేసి, సిబ్బందికి సహకరించాలన్నారు. అనంతరం పి, యాలేరు గ్రామంలో స్వమిత్ర సర్వేను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డిప్యూటీ ఎంపీడీఓ కామక్క, పంచాయతీ సెక్రటరీలు సాదిక్‌వలి, రామాంజినేయులు, మల్లేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అఖిల భారత మేయర్ల సదస్సులో వసీం



మేయర్ వసీంకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: హర్యానాలోని కర్నాల్‌లో మంగళవారం జరిగిన అఖిల భారత మేయర్ల సదస్సుకు మేయర్ వసీం హాజరయ్యారు. కర్నాల్ మేయర్ రేణుబాల గుప్తా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 53వ వార్షిక సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కట్టర్ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదస్సులో మేయర్ వసీం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగరంలో జరిగిన అభివృద్ధి, విప్లవాత్మక సంస్కరణలపై మాట్లాడారు. అనంతరం మేయర్‌కు నిర్వాహకులు జ్ఞాపిక అందజేశారు.

వ్యాసరచన పోటీలు

అనంతపురం కల్చరల్: సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ నిర్వాహకులు రామచంద్ర, గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 వరకు ఉన్నత పాఠశాలల్లో, 8 నుంచి 15వ తేది లోపు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు సత్యసాయి దివ్య సందేశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సహకారమందించాలని కోరారు.

చిరస్మరణీయులు డాక్టర్ వైఎస్సార్



జెడ్పీ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ శ్రేణులు



తపోవనంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించిన అనంత



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మహిళా నేతలు



ఆకుతోటపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



రంగస్వామినగర్ భోజనం వడ్డిస్తున్న అనంత

అనంతపురం కార్పొరేషన్: మహానేత డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం అనంత ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు రోగులకు అన్నదానం చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు ఆస్పత్రిలో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందికి 'అనంత' వస్త్రాలు పంపిణీ చేశారు. తపోవనంలో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానాన్ని ప్రారంభించారు. నగరంలోని 4వ రోడ్డులో ఉన్న స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరాం రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీఎం అయ్యాక రైతు రాజ్యాన్ని తీసుకువచ్చి లక్షలాది మంది రైతులకు మేలు చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులను తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేశారన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్య శ్రీను ప్రవేశపెట్టారన్నారు. పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అందించి ఎంతో మంది ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడ్డారన్నారు. గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నారని, ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్సార్ సీఎం అయ్యాక వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు వైఎస్సార్ స్ఫూర్తితోనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, చంద్రశేఖర్ యాదవ్, శ్రీదేవి, రిలాక్స్ నాగరాజు, బాకే హబీబుల్లా, గాజుల ఉమాపతి, అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనివాసులు నాయక్, ఓబిరెడ్డి, మల్లెమీద నరసింహులు, రాష్ట్ర నాయకులు మదిరెడ్డి నరేంద్ర రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, వెన్నం శివరామిరెడ్డి, పెన్నోబులేసు, రంగంపేట గోపాల్‌రెడ్డి, మీసాల రంగన్న, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు అనంత చంద్రారెడ్డి, పామిడి వీరాంజనేయులు, నల్లప్పరెడ్డి, చింతకుంట మధు, దాదు, అనిల్‌కుమార్ గౌడ్, శ్రీనివాసులు, పుల్లయ్య, జావెద్, సాకే కుళ్లాయస్వామి, కోనారాజారెడ్డి, ఆలమూరు సుబ్బారెడ్డి, సాకే చంద్రలేఖ, తనీష, దేవి, భారతి, ఉష, పార్వతి, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రామాంజులరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామలింగారెడ్డి, కొండారెడ్డి, పుల్లారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరుపురాని మహానేత వైఎస్సార్

రాప్తాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన సువర్ణయుగమని, వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మదిలో చెరగని స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, ఐడీసీఎస్ మాజీ చైర్మన్ బుక్కచెర్ల నల్లప రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కురుబ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో మండల కన్వీనర్ సాకే వెంకటేష్ ఆధ్వర్యంలో మహనేత వైఎస్సార్ 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే మండలా వ్యాప్తంగా మహనేత వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రకుమార్, మహిళా విభాగపు నియోజకవర్గ అధ్యక్షురాలు ఉషారాణి, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి, మహిళ విభాగపు మండల కన్వీనర్ వరలక్ష్మి, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, నాయకులు జూటూరు శేఖర్, సాకే చంద్ర, మాచిరెడ్డి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం వైఎస్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఎంపీపీ హేమలత, సర్పంచ్‌లు వరలక్ష్మి, లక్ష్మీనారాయణరెడ్డి,ఓబులేసు ,నాయకులు వాసుదేవ రెడ్డి, బంధూక మధు, మల్లన్న, నరసింహారెడ్డి, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, ఫణిరెడ్డి, అతిక్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి,శివారెడ్డి, చిన్నా, ఎర్రిస్వామి, మురళి, దామోదర్‌రెడ్డి, శ్రీరామ్, గంగాధర్, ఓబీ టైలర్ వెంకటేష్, గోపాల్‌రెడ్డి, నాగరాజు, వన్నూరప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, బోయ వెంకటేష్,అంజినప్ప, నాగేంద్ర, సురేష్, రాజశేఖర్, లోకేష్, కోటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి , ఆవుల ఈశ్వరరెడ్డి, తైదుల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: పేదల గుండె చప్పుడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆకుతోటపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాలర్పించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంతకాలమూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలను గుర్తు పెట్టుకుంటారన్నారు. అనంతపురం రూరల్ మండల వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీ లింగారెడ్డి, ఆకుతోటపల్లి, ఉప్పరపల్లి, పూలకుంట, ఇటుకలపల్లి, కందుకూరు, కక్కలపల్లిరూరల్ సర్పంచులు గురుప్రసాద్, సావిత్రి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్త రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రేవతిపెద్దప్ప, ఉపసర్పంచ్ ఓబులేసు, నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ సాకే ఆనంద్, విద్యార్థి విభాగం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు ఇటుకలపల్లి చిరంజీవి, నాయకులు జయప్రకాష్‌రెడి, సత్తిరెడ్డి, మణిప్రీత్‌రెడ్డి, మన్నీల పురుషోత్తం, శంకర్, సుధాకర్, చియ్యేడు రవీంద్రరెడ్డి, చలపతి, జంగాలపల్లి తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం



అనాథాశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయులకు భోజనం వడ్డిస్తున్న మాచిరెడ్డి చెన్నారెడ్డి

రాప్తాడు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని మరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచిరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ధర్మవరం ఫంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ వృద్ధుల అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, నాయకులు నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పక్షపాతి వైఎస్సార్



వైఎస్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పక్షపాతి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా ఏపీ వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్. నాగిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2009లో సక్సెస్ స్కూల్స్, తెలుగు మీడియంతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 36 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు కల్పించారన్నారు. డీఎస్సీ 1995, 1996, 1998, 2000లలో ఉపాధ్యాయులు చేసిన రెండేళ్ల అప్రెంటిస్ పీరియడ్‌కు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చారన్నారు. ఏపీ వైఎస్ఆర్టీఏ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటరమణప్ప, రవీంద్రారెడ్డి, గోపాల్, జిల్లా నాయకులు విశ్వనాథరెడ్డి, ఓబిరెడ్డి, కృష్ణ నాయక్, సిద్ధ ప్రసాద్, రామకృష్ణ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

లీగల్ సెల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ఆశ్రయ అనాథశ్రమానికి బియ్యం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేతలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బడా నారాయణ రెడ్డి

అనంతపురం: వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఆశ్రయ అనాథ, వృద్ధాశ్రమానికి 22 బస్తాల బియ్యం ప్యాకెట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గాజుల ఉమాపతి, నేతలు నాగన్న, రాజశేఖర్ యాదవ్, నాగరాజ్, బాబ్జి, ఆదిశేషారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారపు రెడ్డి, రేవతి, జూటూరు సుధాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బడా నారాయణ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్ .నారాయణ రెడ్డి, సురేంద్రాచారి, ఎల్. ప్రభాకర్ రెడ్డి, షేక్షావలి, శ్రీనివాసులు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గుండెచప్పుడు వైఎస్సార్



ఎస్కేయూలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ విద్యార్థి, యువజన విభాగం నాయకులు

అనంతపురం: పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారి గుండెల్లో నిలిచిపోయారి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీ లింగారెడ్డి పేర్కొన్నారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు పి. హేమంత్‌కుమార్, భరత్, సురేష్, తేజశ్వేర్ రెడ్డి, శివ, మనప్రీతి రెడ్డి, నవీన్, యశ్వంత్, ఆకుతోటపల్లి సర్పంచ్ గురుప్రసాద్, ఎంపీటీసీ సునీల్ దత్తా రెడ్డి, రూరల్ కన్వీనర్ గోవింద రెడ్డి, ఉప్పరపల్లి శ్రీనివాసులు, బుర్ర సత్తిరెడ్డి, ఇటుకలపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి, చిరంజీవి, నాగ, తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించాలి



మీటర్ రీడర్ల ధర్నాలో మాట్లాడుతున్న రాజారెడ్డి

అనంతపురం టౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు బకాయి వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ మీటర్ రీడర్స్‌తో కలిసి విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మీటర్ రీడర్ల వేతనాల కోసం విద్యుత్ అధికారుల చుట్టు ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆప్కాస్ ఖాతా ద్వారా వేతనాలను ఇవ్వాలన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, మీటర్ రీడర్ల సంఘం నాయకులు కిరణ్‌కుమార్, రాము, దస్తగిరి, సలీం, భరత్, సుబ్రహ్మణ్యం, రంగస్వామి, ఆనంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు హామీలు నీటిమూటలే'



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

రాప్తాడురూరల్: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత నీట మూటలుగా మారాయని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. రైతాంగ కోర్కెల దినం సందర్భంగా మంగళవారం సోములదొడ్డి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జెండాను మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల వల్ల రైతులు ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వైపు మలుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా అందించడంతోపాటు యూరియా అందుబాటులోఉంచాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎం. రమేష్, జి. శ్రీకాంత్, జి. నరేష్, జి. దుర్గాప్రసాద్, రెడ్డప్ప, నరసింహులు, రాము, లక్ష్మన్న పాల్గొన్నారు.

ప్రతి విషయంపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహా

ఆత్మకూరు: విద్యార్థులు ప్రతి విషయంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో సంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య, యువత అభివృద్ధి, గురించి ఆయన వివరించారు. అదే విధంగా ఏ సమస్యకు ఏ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలన్న విషయాన్ని ఫోన్ నంబర్ సహా తెలియజేశారు. అనంతరం మహిళా శక్తివంతం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



అయ్యవారిపల్లిలో కంది పంటను పరిశీలిస్తున్న అల్తాఫ్ ఆలీఖాన్

రాప్తాడు: సాగు చేసిన పంటల వివరాలను రైతులు తప్పక నమోదు చేయించుకోవాలని అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు అల్తాఫ్ ఆలీఖాన్ సూచించారు. మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లిలో భాస్కర్, గంగలకుంటలో మల్లికార్జున, రాప్తాడులో తిమ్మప్ప సాగు చేసిన పంట నమోదును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన తమ పంటల వివరాలను దగ్గర్లోని ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదును ఈ నెల 30లోపు పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మండలంలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం, సమస్యాత్మక భూముల విషయంలో పంట నమోదుకు వీఆర్వోల సహకారం తప్పనిసరిగా ఉండేలా చూడాలని తహసీల్దార్ విజయకుమారిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది గిరిధర్, భారతి, సోనియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

11న మండల మీట్

రాప్తాదురూరల్: అనంతపురం రూరల్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 11న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దివాకర్ మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

శింగనమల: మండలంలోని వంకల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు.